
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



భానుడి భగభగ


నిర్మానుష్యంగా చిన్నకోడూరులోని వివేకానంద చౌరస్తా

● బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
● నిర్మానుష్యంగా రహదారులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆకాశంలో మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు పడటంతో వాతావరణం కొంత మేర చల్లబడింది. సుమారు వారం నుంచి మళ్లీ ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ వేడిమికి జనాలు తల్లడిల్లుతున్నారు. మధ్యాహ్నం వేళలో పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు జనాలు జంకుతున్నారు. గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాలు, రహదారులు వెలవెలబోతున్నాయి. వాహనాల రాకపోకలు లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండవేడిమికి దాహార్తిని తీర్చుకోవడానికి జనాలు జ్యూస్‌లు, కూల్‌డ్రింక్స్ కొబ్బరిబొండాలు తాగుతూ తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. మధ్యాహ్నం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల కింద సేదతీరుతున్నారు.


చిన్నకోడూరులోని అంబేద్కర్ చౌరస్తా...


వైద్య సేవల కోసం పేరు నమోదు చేసుకుంటున్న రోగులు

సిద్దిపేటలోని ప్రభుత్వాసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో కొన్నినెలలుగా పలు సమస్యలు తిష్టవేశాయి. జిల్లా ప్రజలతో పాటు మెదక్, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి చిన్నాపెద్దా తేడా లేకుండా గర్భిణులు, రోగు లు వేలసంఖ్యలో వైద్యచికిత్సల కోసం వస్తున్నారు. వచ్చిన రోగులను పరీక్షిస్తున్న వైద్యులు రోగానికి సంబంధించి ప్రిస్కిప్షన్‌లో రాసిచ్చిన మందులు అందించడంలో విఫలమవుతున్నారు. ఆసుపత్రిలోని ఫార్మసీ వద్దకు వెళ్తే వైద్యులు రాసిచ్చిన వాటిలో రెండు, మూడు రకాల మందులను రోగులకు అందించి, మిగతా వాటిని బయట తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహా ఇస్తున్నారు.

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి)

మందుల్లేవ్..

● సిద్దిపేట జీజీహెచ్ ఆసుపత్రిలో 50కి పైగా మందుల కొరత
● అందుబాటులో లేని గొంతునొప్పి, పరికడుపు, మాత్రలు పలు రకాల సిరప్‌లు
● కొన్ని రోజులుగా మందులు, కుట్ల దారాలు, బ్యాండేజ్‌లు బయటి నుంచే
● సదుపాయాలు లేక సిబ్బంది, రోగుల ఇబ్బందులు
● రక్త నమూనాల రిపోర్టులు ఆలస్యం.. తిష్ట వేసిన పలు సమస్యలు
● పట్టించుకునే వారు లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తం

సిద్దిపేటలోని 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో గత ప్రభుత్వ హయాంలో సకల సౌకర్యాలను కల్పించడంతో సిద్దిపేట జిల్లాతో పాటు పక్క జిల్లాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ఓపీ, ఐపీ వైద్య సేవల కోసం వస్తున్నారు. ఒక్కోరోజు 1500లోపు వరకు రిజిస్ట్రేషన్ నమోదు అవుతున్నది. ఆసుపత్రిలో రెండు ఐసీయు కేంద్రాలు, డయాలసిస్, ఎస్ఎన్‌సీయు, ఇన్‌పేషంట్, అవుట్ పేషంట్, గర్భిణీలకు చికిత్స, ఆపరేషన్ థియేటర్లు, ఎమర్జెన్సీ వార్డు లాంటి సేవలను ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు.

బయట కొనుక్కోండి

జీజీహెచ్ ఆసుపత్రికి వస్తున్న పలు రోగులపై మందుల రూపేణ ఆర్థిక భారం పడుతున్నది. వైద్య చికిత్సలకు సంబంధించి రోగం నయమవ్వడానికి మందులు ముఖ్యమైనవి కావడంతో, ఆసుపత్రి లో ఏర్పడిన మందుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పలు రోగాలకు సంబంధించి గొంతునొప్పి, పరికడుపు, పలు రకాల సిరప్‌లు, చర్మ వ్యాధులకు సంబంధించిన ఆయింట్‌మెంట్లు, చిన్న పిల్లలకు కంటి చుక్కల మందులు ఇలా 50కి పైగా అందుబాటులో లేవు. దీంతో కొన్ని రోజులుగా రోగులు చేసేది లేక మందులను బయటే కొనుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం రోగుల బంధువులు ప్రమాదంలో గాయపడి చికిత్సకు అవసరమయ్యే కుట్ల దారాలు, బ్యాండెజ్‌లు బయట నుంచే కొనుకున్నారంటే పరిస్థితి ఎలా మారిందో అర్థమవుతున్నది. వాస్తవానికి 50కి పైగా మందులు మాత్రమే లేవని వైద్యశాఖ అధికారులు, సిబ్బంది చెబుతున్నప్పటికి భిన్నమైన పరిస్థితి ఉందని తెలింది.

ఆరుబయటే భోజనాలు

నిత్యం వేలాది సంఖ్యలో వస్తున్న వారికి భోజనం చేసేందుకు కనీస సౌకర్యాలు, వసతి లేకపోవడంతో రోగుల బంధువులు, ఆసుపత్రి పారిశుధ్య సిబ్బంది మండిపడుతున్నారు. ఆసుపత్రి ఆవరణలో ఆరుబయటే రోగుల బంధువులు భోజనం చేస్తుండగా పారిశుధ్య కార్మికులు ఎక్కడో ఓ మూలన కూర్చుని తింటున్నారు. రోగుల బంధువులకు పేరుకు విశ్రాంతి భవనాన్ని కేటాయించినా అందులో సగం వరకు వంటశాల ఉండటంతో రోగులు ఆరుబయటే సేద తీరుతున్నారు. స్నానాలు చేసిన తరువాత దుస్తులను ఆసుపత్రి భవనంలో ఏర్పాటు చేసిన ఫైర్ పైపులపై తదితర వాటిపై దుస్తులను ఆరబెట్టుకుంటున్నారు. దీనికి తోడు ఆసుపత్రిలో కోతులు కూడా స్వైర విహారం చేస్తూ రోగుల బంధువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

ల్యాబ్ రిపోర్ట్‌కు ఆలస్యం..

వైద్యసేవల కోసం వస్తున్న రోగులకు సోకిన వ్యాధిని నిర్ధారించేందుకు వైద్యులు పలు రకాల రక్త, మూత్ర పరీక్షలు రాస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన రక్త, మూత్ర పరీక్షా కేంద్రానికి వెళ్లిన వారికి సకాలంలో రిపోర్టులు అందడం లేదు. మరుసటి రోజో లేదంటే ఆ తరువాత రోజో వైద్యుడి దగ్గరికి వచ్చిన రిపోర్టుల ఆధారంగా సోకిన వ్యాధి, అందుకు తగిన చికిత్స వివరాలను వైద్యులు రోగులకు సూచిస్తున్నారు. గతంలో జీజీహెచ్ ఆసుపత్రిపై నిత్యం సమీక్షలు ఉండగా, ఉద్యోగులు, సిబ్బంది పని తీరు మెరుగ్గా ఉండేది. ఇటీవల ఆసుపత్రిపై ఉన్నతాధికారులు, మంత్రులు పట్టించుకోకపోవడంతో వైద్యసేవలు, మందులు అందించడంలో ఆలస్యమవుతున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రిస్కిప్షన్‌లో మందులను బయట తీసుకోవాలని మార్క్ చేసిన ఫార్మసీ సిబ్బంది


ఆసుపత్రి ఆవరణలో భోజనం చేస్తున్న రోగుల బంధువులు


రోగులను తీసుకురావాల్సిన స్ట్రెచర్‌పై మందులను తెస్తున్న సిబ్బంది


ఆసుపత్రి అవరణలో ఆరేసిన దుస్తులు

జిల్లాలో జోరుగా గుట్కా దందా

● నిషేధం ఉన్నా విచ్చలవిడిగా అధిక ధరలకు విక్రయం



సిద్దిపేటక్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్ల విక్రయాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. గంజాయి ఇతర మత్తుపదార్థాలతో పాటు ప్రభుత్వం గుట్కా, పాన్‌మసాలా, తంబాకు ఉత్పత్తులను పూర్తిగా నిషేధించింది. జిల్లాలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతుంది.

పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి

గుట్కా, అంబర్‌ప్యాకెట్లు, పాన్‌మసాలా, తంబాకు ఉత్పత్తులను పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి జిల్లాలోకి రవాణా జోరుగా సాగుతున్నది. కర్ణాటకలోని బీదర్ నుండి కొంతమంది వ్యాపారులు రాత్రిపూట భారీగా సరుకు జిల్లాకు చేరుస్తున్నారు. బీదర్ నుంచి జహీరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ తూప్రాన్, గజ్వేల్ నుంచి సిద్దిపేటకు వివిధ రకాల గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రం నుంచి వివిధ మండలాల కేంద్రాలకు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఇంత యథేచ్ఛగా గుట్కా ప్యాకెట్ల దందా కొనసాగుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

రోగాల పాలు..

గుట్కా, పాన్‌మసాలా, అంబర్, వివిధ రకాల తంబాకు ఉత్పత్తులు తీసుకున్నవారు అనారోగ్యానికి గురవుతున్నారని, కేన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ప్రభుత్వం నిషేధించింది. సంబంధిత అధికారులు ఈ గుట్కా దందాపై దృష్టి సారించకపోవడంతో కొన్ని కిరాణషాపుల్లో, కొన్నిపాన్‌షాపుల్లో, గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లు యథేచ్ఛగా దొరుకుతున్నాయి. వీటికి అలవాటు పడి న వారు అనారోగ్యానికి గురవుతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎక్కువగా బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తులు భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. వారు ఈ గుట్కా ప్యాకెట్లను తీసుకొని అనారోగ్యానికి గురవుతున్నారు.

అధిక రేట్లకు విక్రయాలు

జిల్లాలో కొంతమంది బడా వ్యాపారులు పక్క రాష్ట్రాల నుంచి గుట్కా ప్యాకెట్లను భారీగా దిగుమతి చేసి కిరాణా షాపులకు, పాన్ షాప్‌లకు సరఫరా చేస్తున్నారు. గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు, పాన్ మసాలా, తంబాకు ఉత్పత్తులకు రకరకాల పేర్లను పెట్టి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. ఈ గుట్కా ప్యాకెట్లకు అమ్మకాలపై నిషేధం ఉండడంతో మార్కెట్లో బాగా డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారస్థులు ఎమ్మార్పీకి కాకుండా అధిక రేట్లకు అమ్మకాలు చేపడుతున్నారు. మాణిక్‌చంద్, విమల్, ఖైనీ ఖైనీ, హాన్స్, ఎంజీఎం, రెబల్, పాన్ బార్, మీ రాజ్, 1000 ఖలేజా, కే7000, కే9000, 24 క్యారెట్, ఆర్డియం, పేర్లతో గుట్కాలు, తంబాకు ప్యాకెట్లు దొరుకుతున్నాయి. కొన్ని దుకాణాల్లో, పాన్ షాప్ లలో వీటిని బహిరంగంగానే అమ్ముతున్నారు.

చర్యలు శూన్యం

ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఉత్పత్తుల విక్రయాలు జిల్లాలో జోరుగా సాగుతున్నప్పటికీ పోలీసులు దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కొన్ని షాపుల్లో బహిరంగంగా అమ్ముతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో జరుగుతున్న గుట్కా విక్రయాల గురించి పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, జరుగుతున్న గుట్కాదందాను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

● సీపీ అనురాధ



సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగులకు పాల్పడినా.. ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని సీపీ అనురాధ అన్నారు. జిల్లాలో ఎవరైనా క్రికెట్, మరే ఇతర బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పోలీసులు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడం, టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఇతర ప్రత్యేక బృందాలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకు, డయల్ 100కు సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712667100 సమాచారం అందించాలని సూచించారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● కలెక్టర్ మనుచౌదరి

మిరుదొడ్డి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లోని మహాత్మాజ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న కూరను రుచి చూశారు. పాఠశాలకు అవసరమైన వసతులను ఒక్కోటిగా సమకూరుస్తామని తెలిపారు. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకునిరావాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ భాస్కరశర్మ, ఎంఈవో ప్రభుదాస్, సిబ్బంది తదితరులున్నారు.


హబ్షీపూర్‌లో బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సందర్శిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

రేషన్‌షాపులను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు

మద్దూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలోని రేషన్‌షాపులను జిల్లా విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలోని పేదలందరికీ రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం అందించేందుకు ఏప్రిల్ 1న పథకానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. ఈ క్రమంలో రేషన్‌షాపులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం పేదలకు అందుతున్నాయా లేవా? అని అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మద్దూరులోని రేషన్‌షాపును తనిఖీ చేశారు. షాపునకు కేటాయించిన సన్న బియ్యం ఏ మేరకు పేదలకు అందించారు. స్టాక్ ఎంత ఉంది? రికార్డులు సరిగ్గా ఉన్నాయా వంటి విషయాలతో పాటు పలు అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ అధికారులతో పాటు రేషన్ డీలర్ ఎండీ కరీం ఉన్నారు.

కొండపాకలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం

కొండపాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు అనంతరం ఇండ్ల నిర్మాణం కోసం మోడల్ హౌస్‌ను అధికారులు కొండపాకలో నిర్మిస్తున్నారు. కొండపాక సమీకృత కార్యాలయ సముదాయ భవన సమీపంలో మోడల్ హౌస్ నిర్మాణాన్ని చేస్తున్నారు. సుమారు 400 స్క్వేర్ ఫీట్ల స్థలంలో రూ.5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణానికి ఖర్చవుతుందని ఇందిరమ్మ హౌసింగ్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. వేసవిలో చల్లగా ఉండడం కోసం బెంగళూరు టైల్స్ వాడుతున్నారు. అలాగే స్టీల్ తక్కువ అయ్యే విధంగా బ్రిక్స్, టైల్స్ వాడుతూ నిర్మాణం చేపడుతున్నారు. కిచెన్, హాల్, ఒక బెడ్‌రూం, వాష్ రూం ఉండేలా నిర్మాణం చేస్తున్నారు. బుధవారం మోడల్ హౌస్ స్లాబ్ వేశారు. నిర్మాణాన్ని హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు,తహసీల్దార్ దిలీప్ నాయక్ తదితరులు పరిశీలించారు.


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు


కొండపాకలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్

చట్టాలపై అవగాహన

నర్సాపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మిశారద ఆదేశాల మేరకు మండలంలోని రెడ్డిపల్లిలో డ్వాక్రా మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, బాలకార్మికులు,పోక్సో చట్టం తదితర అంశాలతో పలు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, ఎ.శ్రీనివాస్, స్వరూప, రాజు,సుధాకర్, ఏపీఎం గౌరిశంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.






చాప్టా.కెలో అంగన్‌వాడీ స్కూల్‌డే


నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాప్టా.కె లో బుధవారం అంగన్‌వాడీ స్కూల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడాతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం నర్సింహులు, ప్రాథమిక హెచ్ఎం ఎంగ్రాం, అంగన్‌వాడీ టీచర్ జగదేవి, బాబురావు, హరిసింగ్, హెల్త్ ఆఫీసర్ విజయక్రిష్ణరెడ్డి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సన్నబియ్యం పంపిణీ



నాగల్‌గిద్ద, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శిఖార్ ఖానా గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ సంఘం మండల అధ్యక్షుడు గడ్డ సంగ్ శెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్నబియ్యం భోజనం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సచిన్‌పాటిల్, అనిల్‌పటేల్, డీలర్లు అమ్రేష్, శివకుమార్ పాల్గొన్నారు.







మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఏర్పాట్లు పూర్తి

● సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రీల్ 9 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఉదయం సంగారెడ్డి పట్టణంలోని ఆర్‌అండ్‌బి కార్యాలయం పక్కన ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించినానంతరం కల్వకుంట రోడ్డులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సభలో సమాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేలా ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు వివిధ సంఘాల నాయకులు, యువత, స్థానిక ప్రజలు కార్యక్రమానికి హాజరై జయంతిని విజయవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి కోరారు.

అగ్నివీర్ దరఖాస్తులకు గడువు పొడిగింపు...

భారత సైన్యంలో అగ్ని కీటగిరిలో నియామకం కోసం వెలువరించిన దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓ ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జూనిర్ కమిషన్డ్ అధికారులు, ఇతర హోదాల నియామకానికి సంబంధించిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు నమోదు చేసుకునేందుకు గడువును పొడిగించారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు ఆత్మ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

● హాజరుకానున్న మంత్రి దామోదర రాజనరసింహ


తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి

పుల్‌కల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్‌గా నేడు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రి దామోదర రాజనరసింహ సిఫారసు మేరకు మల్లారెడ్డిని ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులరాలు రమాదేవి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మల్లారెడ్డితో పాటు మరో 23 మంది సభ్యులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం 11 గంటలకు పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి దామోదర రాజనరసింహ హాజరుకానున్నారు.

ఎమ్మెల్యే పార్టీ వీడాక కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం

● బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి


పాదయాత్ర చేస్తున్న ఆదర్శరెడ్డి, కార్పొరేటర్ సింధూ

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పార్టీ వీడిన తరువాత కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపయిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, కార్పొరేటర్ సింధూ అన్నారు. బుధవారం రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గణేష్‌గడ్డ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. నియోజకవర్గంలోని పార్టీశ్రేణులతో కలిసి రామచంద్రాపురం కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీని వీడిన తరువాత బీఆర్ఎస్ పని అయిపోయిందంటూ ప్రచారం చేశారని తెలిపారు. పాదయాత్ర నిర్వహణ సందర్భంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఐడీఏ బొల్లారం మాజీ జడ్‌టీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, అమీన్‌పూర్ నాయకులు యూనూస్, గోపాల్, జగదీష్ తదితరులు ఉన్నారు.

14న సంగారెడ్డిలో మహార్యాలీ

సంగారెడ్డి రూరల్, ఏప్రీల్ 9 (ఆంధ్రజ్యోతి) : డా. బీఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదిన సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహిచనున్నట్లు అంబేద్కర్ ఉత్సవ కమిటి చైర్మన్ అనంతయ్య, వైస్ చైర్మన్ పల్లె సంజీవయ్య తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం అంబేద్కర్ జయంతికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొండాపురం జగన్, దుర్గాప్రసాద్, అశోక్, నందకిషోర్, నాగరాజ్, హనుమంతు, సునీల్, ఉదయ్, మోహన్, రాజు, సదానంతం, పురుషోత్తం, రవి, రాజు పాల్గొన్నారు.



శుభకార్యానికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

● రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..
● మరొకరికి తీవ్ర గాయాలు


వీరయ్య(ఫైల్)

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన గడ్డం వీరయ్య(62), గడ్డం మల్లయ్య తమ స్వగ్రామం నుంచి మెదక్ వైపు బంధువుల పెళ్లికి బైక్‌పై వెళ్తున్నారు. మెదక్ మండలం తిమ్మక్కపల్లి శివారులోకి రాగానే వెనుకవైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో వీరయ్య పక్కనే ఉన్న గుంతలోపడి అక్కడికక్కడే మృతి చెందగా, మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ పోలీసులు తెలిపారు.

'ఫైనాన్స్' వేధింపులకు యువకుడు బలి

● ఉరివేసుకుని ఆత్మహత్య


ప్రశాంత్(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ వారి వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని మానెపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మానెపల్లి గ్రామానికి చెందిన అక్కల లలిత, లచ్చయ్య దంపతుల ఏకైక కుమారుడు ప్రశాంత్(20) సుమారు ఏడాది క్రితం వెల్దుర్తిలోని ఓ షో రూంలో ఫైనాన్స్‌పై బైక్‌ను కొనుగోలు చేశాడు. బైక్ ఈఎంఐ సక్రమంగా చెల్లించకపోవడంతో ఫైనాన్స్ నిర్వాహకులు నాలుగు రోజుల క్రితం బైక్‌ను తీసుకెళ్లి వేధింపులకు పాల్పడ్డారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ప్రశాంత్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బుధవారం ఉదయం వెతకగా తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యం


సరితాదేవి (ఫైల్)

ఐడీఏబొల్లారం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం నలందా జిల్లా జగదీష్‌పూర్ గ్రామానికి చెందిన సరితాదేవి ఐడీఏబొల్లారం పట్టణ పరిధి బాలాజినగర్‌లో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా ఆమెకు మతిస్థితిమితంగా లేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త బిర్జూషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


మృతి చెందిన లేగదూడ

హవేళిఘణపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో లేగదూడ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామానికి చెందిన ఆశ రాజయ్య గ్రామ శివారులో రోజు మాదిరాగానే మంగళవారం రాత్రి ఆవు, లేగదూడను తన పశువుల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసే సరికి లేగదూడ మృతిచెంది కనిపించింది. చిరుత దాడి చేసి చంపినట్లు ఆనవాలు కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ కృషి

● ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీష్‌వర్ధన్


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు

నర్సాపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ విద్యార్థుల హక్కుల సాధన, సామాజిక సేవ కోసం ఎప్పుడు పనిచేస్తూనే ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హరీష్‌వర్ధన్ తెలిపారు. బుధవారం ఎన్ఎస్‌యుఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభులింగం, కృష్ణారెడ్డి, నితీష్, సాయి, ఆంజనేయులు, రవి, దశరత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


మునిపల్లి : సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

అల్లాదుర్గం,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రైన అల్లాదుర్గంలో పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మునిపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 36మందికి సంబంధించి మంజూరైన రూ.17లక్షల 38వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ బుర్కల పాండు, మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుంటున్న వర్సిటీల ప్రతినిధులు

నూతన పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

ములుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సాంకేతిక రంగంలో తీర్చిదిద్దడం కోసం కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. బ్లైండ్ కలర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాస్టికల్చర్ మధ్య ములుగు శివారులోని వర్సిటీలో ఉపకులాపతి డాక్టర్ దండా రాజిరెడ్డి ఒప్పందం కుదరింది. ఉద్యాన పంటలపై పరిశోధన, అభివృద్ధి శిక్షణలో సహకారాన్ని పెంపొందించడానికి ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, బ్లైండ్ కలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శుభం రవి, డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనానాయక్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ సురేష్‌కుమార్, లైబ్రేరియన్ డాక్టర్ రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాస్, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ వీణ జోషి, పీఆర్ఓ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వాయునందన్, తదితరులు

ప్రభుత్వ విధానాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలసీల రూపకల్పనలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని మహారాష్ట్రలోని యశ్వంత్‌రావు ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వాయునందన్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల జాతీయ సెమినార్‌లో భాగంగా సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మొదటి రోజు బుధవారం 'ప్రభుత్వ విధానాల రూపకల్పన- నైతిక విలువల పాత్ర' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధాన రూపకల్పన రాజకీయ పాలన వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని, ఇది అవినీతికి ఓటు బ్యాంకుకు అవకాశం లేకుండా వాస్తవ అభివృద్ధిని ప్రోత్సహించే విధంగా ఉండాలని తెలిపారు. సీసీఈ అకాడమీ గైడెన్స్ ఆఫీసర్ ప్రొ.బాల భాస్కర్, ఆజాద్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నజీవుల, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడారు. అంతకుముందు సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ మల్లిక, అధ్యాపకులు విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మూల్యాంకనంలో పొరపాట్లు జరగొద్దు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సాగుతున్న పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. మూల్యాంకన కేంద్రం వద్ద తాగు నీరు ఇతర అన్ని సౌకర్యాలను సమకూర్చాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డికి సూచించారు.

కాచిగూడ-హిస్సార్ మధ్య 22 సమ్మర్ స్పెషల్స్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ-హిస్సార్ మధ్య 22 వేసవి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 17నుంచి జూన్ 26 వరకు ప్రతి గురువారం సాయంత్రం 4గంటలకు కాచిగూడ నుంచి, ఈ నెల 20 నుంచి జూన్ 29వరకు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు ఈ ప్రత్యేక రైళ్లు బయలుదేరుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో అన్నీ ఏసీ త్రీటైర్ కోచ్‌లే ఉంటాయని, మార్గమధ్యంలో మల్కాజిగిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముద్కేడ్, నాందేడ్ తదితర స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రయాణికులకు రిజర్వేషన్ సదుపాయం అందుబాట్లో ఉంటుందని సీపీఆర్ఓ తెలిపారు.

దగ్గరవుతున్న దూరవిద్య

వెలుగు దివ్వెగా అంబేడ్కర్ రీజనల్ స్టడీ సెంటర్

- గృహిణులకు, చిరుద్యోగులకు వరం
- ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు
- ఆత్మీయ సమ్మేళనానికి సన్నాహాలు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలని ఎవరికి మాత్రం ఉండదు. కానీ, వారి వారి ఆర్థిక, ఇతరత్ర పరిస్థితుల వల్ల చదవలేకపోతారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సాధించాలి అని ప్రతి ఒక్కరు కలలుకంటారు. కొంతమంది చదివిన దానికి సంబంధం లేకపోయినా ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. చేస్తున్న ఉద్యోగంలో ఎదుగుబొదుగు లేదు ఇంకాస్త పెద్ద చదువులు చదివి ఉంటే బాగుండు. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం చేయాలి, కానీ ఇంట్లో పెళ్లి చేశారు. ఇలా చాలా మంది వివిధ రకాల కారణాలతో చదువు మధ్యలో ఆపేయడమో, ఉద్యోగ బాధ్యతలతో ఉన్నత చదువులు చదవలేక నిరాశగా ఉన్నవారికి డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య చిరునామగా మారింది. హైదరాబాద్ కేంద్రంగా అనేక జిల్లాలలో శాఖోపశాఖలుగా మారి వివిధ కోర్సులను అందిస్తూ, ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతుంది.

సిద్దిపేటలో స్టడీ సెంటర్‌గా మొదలై..

1984లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో అంబేడ్కర్ స్టడీ సెంటర్ మొదలైంది. మొదట్లో యూజీ కోర్సులతో కేంద్రం ప్రారంభమైంది. 2005లో ప్రత్యేక నూతన భవనంలోకి మారింది. 2006లో యూజీతో పాటుగా పీజీ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. 2007లో స్టడీ సెంటర్ నుంచి రీజనల్ స్టడీ సెంటర్‌గా మారింది. హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, నర్సాపూర్, మెదక్, జోగిపేట, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్‌లోని అంబేడ్కర్ స్టడీ సెంటర్లు సిద్దిపేట రీజనల్ స్టడీ సెంటర్‌కు అనుబంధంగా పనిచేస్తున్నాయి. ప్రతి సంవత్సరం సగటున 1600 నుంచి 1800 మంది విద్యార్థుల అడ్మిషన్స్ ఎన్‌రోల్ అవుతున్నాయి. ఈ స్టడీ సెంటర్‌లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ రంగాల్లోనే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా కొనసాగుతున్నారు. రాజకీయాల్లో కూడా రాణిస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ గ్రూప్స్ ఫలితాల్లో కూడా అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో చదువుకున్న వాళ్లు ఉన్నారు. ప్రస్తుతం సిద్దిపేటలోని అంబేడ్కర్ ప్రాంతీయ విద్యా కేంద్రంలో యూజీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కోర్సులు అందుబాటులో ఉంటాయి.



సిద్దిపేట అంబేడ్కర్ రీజనల్ స్టడీ సెంటర్

ఆత్మీయ సమ్మేళానికి ఏర్పాట్లు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అనేది సాధరణంగా పాఠశాలలు, కాలేజీల్లో చూస్తుంటాం. వినూత్నంగా సిద్దిపేట అంబేడ్కర్ రీజనల్ సడీ సెంటర్‌లో చదివిన పూర్వ విద్యార్థులతో అపూర్వ సమ్మేళనం చేపట్టాలని రీజనల్ కో ఆర్డినేటర్ డా. శ్రద్ధానందం కార్యక్రమ రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య ద్వారా విద్యనభ్యసించి ఉన్నతమైన పదవులను చేపట్టిన వారి సక్సెస్ స్టోరీలను పుస్తకరూపం తీసుకరావాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 40 సంవత్సరాలుగా ఈ కేంద్రంలో చదివిన పూర్వ విద్యారుల వివరాలను సేకరిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సెల్ నెంబర్‌లు, వాట్సప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి అందరిని సమయాత్తం చేస్తున్నారు.

అంబేడ్కర్ దూరవిద్య వరం లాంటిది



చదువుకోవాలని ఆసక్తి ఉండి పరిస్థితుల కారణంగా చదువు దూరమైన వారికి అంబేడ్కర్ దూరవిద్య వరం లాంటింది. ఈ సెంటర్‌లో చదివిన వారు చాలామంది మంచి పొజిషన్‌లలో ఉన్నారు. 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ రీజినల్ సెంటర్‌లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే ఓ నిర్ణయానికి వస్తాం.

డా. శ్రద్ధానందం, రీజనల్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్, సిద్దిపేట

మధ్యతరగతి వారికి ఓపెన్ యూనివర్సిటీ వరం



సిద్దిపేట స్టడీ సెంటర్‌లో బీఏ పూర్తిచేశాను. హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ అందిస్తున్న డిస్టెన్స్ స్టడీస్ పేద మధ్య తరగతి వాళ్లకు చాలా బాగా ఉపయోగపడుతుంది. ఈ స్టడీ సెంటర్ లేకుంటే చదివేవాడిని కాదేమో.. దూరవిద్యలో చదివి ఉద్యోగం సాధించాను. నా జీవితం మారిపోయింది.

- బాల ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హుస్నాబాద్

వర్సిటీ నాకు చాలా ఇచ్చింది



1087-90 బ్యాచ్‌లో ఇక్కడ డిగ్రీ చదివాను. బీఈడీ చేసి 2000లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం కుకునూరుపల్లి పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పని చేస్తున్నా. ఇప్పటి వరకు 200 పాఠశాలలో బాల సాహిత్య కార్యశాలలు చేసాను. ఇప్పటి వరకు 55 పుస్తకాలు రాసాను, అచ్చు వేయించాను. అందులో పిల్లలవే ఎక్కువ. ఇదంత కూడా ఓపెన్ యూనివర్సిటీ బిక్షే అని గర్వంగా చెప్పుకుంటాను.

-వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, కుకునూరుపల్లి

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన



సర్వేశ్వర అంబిక శివయోగిని సన్మానిస్తున్న నాయకులు

రేగోడ్, ఏప్రిల్ 9. (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్. ఇటిక్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం బుధవారం కనుల పండుగగా జరిగింది. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవం దుద్యాల సర్వేశ్వర మఠం శ్రీహరి అంబిక శివయోగి స్వామి చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి నిర్వహించిన పలు ప్రత్యేక పూజలలో భక్తులు అశేషంగా హాజరయ్యారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, తెలంగాణ పత్రిక సంపాదకులు నీలకంఠం ముదిరాజ్, శ్రీనివాస్, ప్రచార కమిటీ కన్వీనర్ బానిస నారాయణ, సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, హాజరయ్యారు.

మానవత్వం చాటిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద వదిలి వెళ్లిన బంధువులు- హోప్ ఫౌండేషన్‌కు తరలింపు



వృద్ధురాలితో రాకేష్ షెట్కార్

నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఐదుగురు కొడుకులు ఉన్నా 90 ఏళ్ల వృద్ధురాలైన కన్నతల్లిని సికింద్రాబాద్ గాంధీ వైద్యశాల సమీపంలో వదిలి పెట్టిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఆమెను బుధవారం చేరదీసి హోప్ ఫౌండేషన్ కేంద్రంలో చేర్పించారు. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వృద్ధురాలిని నెల రోజుల క్రితంగాంధీ వైద్యశాల సమీపంలో వదిలి పెట్టడంతో, ఆమె వచ్చి పోయే వారిని గమనిస్తూ వారి వైపు చూస్తుండడంతో, ఈ విషయం పత్రికల్లో వచ్చింది. దీంతో రాకేష్ షెట్కార్ ఆమె వద్ధకు వెళ్లి ఆమె వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించారు. పేరు కాశమ్మ అని, ఐదుగురు కొడుకులు ఉన్నారని, నారాయణఖేడ్ ప్రాంతమని చెబుతున్నప్పటికీ, సొంత ఊరు పేరు చెప్పలేక పోతుంది. నా మనవడు ఇక్కడ వదిలిపెట్టి వెళ్లాడని తెలుపడంతో రాకేష్ షెట్కార్ ఆమెను పరామర్శించి, హోప్ ఫౌండేషన్ కేంద్రానికి తరలింప చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

పాత ఫోన్లతో పరేషాన్..!

● అంగన్‌వాడీ టీచర్లకు 2జీ ఫోన్లు ● యాప్‌లు పని చేయక ఇబ్బందులు ● వివరాల నమోదు ఆలస్యం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన ఫోన్లు మోరాయిస్తున్నాయి. 2018లో 2జీ టెక్నాలజీ ఫోన్లను అంగన్‌వాడీ టీచర్లకు కేటాయించగా, ఆ ఫోన్లలో ఐసీడీఎస్ ఇస్తున్న యాప్‌లు వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. యాప్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేయడానికి కొన్నిసార్లు రెండు రోజులు పడుతుండటంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అంగన్‌వాడీలో ఆధునిక సేవలను అందుబాటులో తీసుకువచ్చేందుకు 2018లో అంగన్‌వాడీ టీచర్లకు ఫోన్లను అందజేశారు. అప్పట్లో అవి 2జీ ఫోన్లు కాగా, మెమురీ కూడా 1.5 జీబీ మాత్రమే. దాదాపు ఏడు సంవత్సరాల క్రితం ఇచ్చిన ఈ ఫోన్లు ఇప్పటి అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన ఫోన్లలో కేంద్ర ప్రభుత్వ పోషన్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లు వినియోగించాల్సి ఉంటుంది. ఈ యాప్‌ల్లో వివరాలు ఎంటర్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మెమొరీ సరిపోక యాప్‌లు పని చేయడం లేదని అంటున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీలో చేరిన పిల్లల వివరాలను గతంలో ఒకసారి నమోదు చేస్తే సరిపోయేది. అయితే, గత నెల నుంచి కొత్త రూల్ తీసుకువచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లల ఫోటోను క్యాప్చర్ చేసి, ప్రతీ నెల ఆధార్ కార్డులో సహా కేంద్ర ప్రభుత్వ యాప్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పాతబడి పోవడంతో ఫొటోలు క్యాప్చర్ కావడం లేదు. విద్యారుల వివరాల నమోదు, ఫోటో క్యాప్చర్ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు తమ ఇళ్లలోని ఫోన్లలో.. మరికొందరు సొంతంగా ఫోన్లు కొనుగోలు చేసి వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పాత ఫోన్ల స్థానంలో కొత్త టెక్నాలజీ ఫోన్లను అందించాలని పలువురు అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లతో ఇబ్బందులు తలెత్తుతున్న విషయం దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

-శారద, సీడీపీవో

హోరా హోరీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో బుధవారం నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా సాగాయి. నల్లరేగడి మట్టి నేలలో భగభగ మండే ఎండను సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధుల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఈ కుస్తీ పోటీలను తిలకించేందుకు జనాలు సైతం భారీగా తరలి వచ్చారు. స్థానిక రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలకు కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఖేడ్ ప్రాంతంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది మల్లయోధులు పాల్గొని తమ సత్తాను చాటుకున్నారు. స్థానిక రామాలయం ఆధ్వర్యంలో వంద సంవత్సరాలకు పైబడి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు కూడా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వివేకానంద్, ఆలయ కమిటీబాధ్యులు పాండు, నిర్వాహకులు సాయిలుపటేల్, కన్నయ్యలాల్, సంజీవ్, భరత్‌సేత్, మదన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై రాములోరి ఊరేగింపు

ఖేడ్‌లో రామ నవమి వేడుకల సందర్భంగా బుధవారం అశ్వవాహనంపై రాములోరిని ఊరేగించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, మాజీ చైర్మన్ ముత్యం హన్మండ్లు, వివేకానంద్, పాండు, తదితరులు పాల్గొన్నారు. సప్తాహ కార్యక్రమంలో భాగంగా కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్ గాథ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కుస్తీపడుతున్న మల్లయోధులు

స్టేడియాలు మంజూరయ్యేనా ?

• నాలుగు చోట్ల ఏర్పాటు • ప్రభుత్వానికి ప్రతిపాదనలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఆ శాఖ తన వంతు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా క్రీడాప్రాధికార సంస్థ ఆధీనంలోని స్టేడియాలల్లో క్రీడల పరంగా ఏమేం అవసరమున్నాయే దానిపై ప్రతిపాదనలు రూపొందించిన ఆ శాఖ జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టేడియాల్లో కోచ్‌లతో పాటు అవసరమైన క్రీడా పరికరాలు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. అయితే ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా నిధులు మంజూరైతే జిల్లాలో క్రీడలు, క్రీడా మైదానాల అభివృద్ధికి మహర్దశ పట్టనుంది.

సంగారెడ్డిలోని డా.బి.ఆర్.అంబేద్కర్ స్టేడియం 7 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ స్టేడియంలో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలతో పాటు సింథటిక్ ట్రాక్, స్టేడియం ఆధునీకరణ కోసం రూ.32 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. నారాయణఖేడ్ సమీపంలోని జుక్కల్ గ్రామంలో 5.21 ఎకరాల విస్తీర్ణంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల ఏర్పాటుకు రూ.20 కోట్ల ప్రతిపాదనలు సమర్పించారు. పటాన్‌చెరు పరిధిలోని పాటిఘన్‌పూర్‌లోని ఐదెకరాల విస్తీర్ణంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల ఏర్పాటుకు రూ.25 కోట్లు ప్రతిపాదించారు. ఈ మధ్యనే హత్నూరలో 4.20 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం క్రీడాప్రాధికార సంస్థకు కేటాయించగా, ఆ స్థలంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల ఏర్పాటుకు సుమారు రూ.25 కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు. ఇవే కాకుండా వివిధ క్రీడాంశాల్లో తర్ఫీదునిచ్చేందుకు కోచ్‌ను నియమించాలని కూడా ప్రతిపాదనలు పంపారు.



విజయ పథాన పాడి

రైతులకు ప్రోత్సాహకాలు
పాడిరైతులకు సంక్షేమ పథకాలు
తాజాగా పాల సేకరణ ధర పెంపు
ఈ నెల ఒకటి నుంచి వర్తింపు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ) ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంచేందుకు వివిధ సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతోంది. పాడి రైతులకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. విజయ డెయిరీ ద్వారా ఈ-ల్యాబ్‌లో పేరు నమోదు చేసుకున్న రైతులకు సంక్షేమ పథకాలు వర్తించనున్నాయి. పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తూ, పాడి పరిశ్రమాభివృద్ధి కోసం అధికారులు కృషి చేస్తున్నారు. తాజాగా పాల సేకరణ ధరను పెంచింది. లీటర్ పాలకు విజయ డెయిరీ ద్వారా రైతుకు రూ.56 (వెన్న శాతం7)కు చెల్లిస్తుండగా..దీన్ని రూ.3.20 పెంచి లీటర్‌కు రూ.59.50పైసలు చెల్లించనున్నారు. 10 శాతం వెన్న ఉన్న పాలకు లీటర్‌కు రూ.80 ఉండగా.. పెంచిన ధరతో లీటర్ రూ.84.60పైసలకు చేరింది. ఆవు పాల ధర తగ్గించారు. అత్యధికంగా గేదె పాల సేకరణ జరగుతోంది. ఈనెల ఒకటో తేదీ నుంచే కొత్త ధరలు వర్తించనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు విజయ డెయిరీ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. పాడి రైతులకు ప్రీమియం ధర చెల్లించడంతోపాటు ప్రోత్సాహకాలను కూడా అందజేస్తోంది. పాడి రైతులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో సంస్థ పాల సేకరణ ధరను పెంచింది.

-గోపాల్ సింగ్, డీడీ
విజయ డెయిరీ



జిల్లాలో 5 వేల లీటర్ల పాల సేకరణ..

జిల్లాలో మెదక్, రామాయంపేట, చేగుంట, కౌడిపల్లి, పాపన్నపేట, పెద్దశంకరంపేట, రేగోడ్. యవాపూర్‌లలో మినీ పాలశీతలీకరణ కేంద్రాలున్నాయి. వీటికి తోడు 150 పాల సేకరణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 2 వేల మంది రైతుల ద్వారా నిత్యం 5 వేల లీటర్ల పాల సేకరణ జరగుతుంది. ధర పెంపు కారణంగా బయటి వ్యక్తులు, సంస్థలకు వెళ్లే పాలు నేరుగా విజయ డెయిరీకి చేరుకోనున్నాయి. తద్వారా విజయ డెయిరీకి పాల సేకరణ పెరగడంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. పెరిగిన ధర ప్రకారం పాడిరైతులకు నెలకు రూ. 4 లక్షలకు అదనపు ఆదాయం రానుంది.

విజయ డెయిరీ సంక్షేమ పథకాలు..

- విజయ పెళ్లి కానుక రూ. 5 వేలు.
- సబ్సిడీపై పశు దాణా. నట్టల మందులు అందజేత
- పాడి పశువులు కొనుగోలుకు ముద్ర, పీఎంఈజీపీ ద్వారా సబ్సిడీ రుణాలు
- ఉచిత పశువైద్య శిబిరాల ఏర్పాటు.
- పాడి రైతులకు పాల సేకరణ ధర పెంపు, వర్తింపు.
- పాడి రైతు మరణిస్తే అంత్యక్రియల కోసం వియజ వైకుంఠదామం కింద రూ.5 వేలు అందజేత
- అధిక శాతం ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ కలిగిన పాలకు ప్రీమియం ధర

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

● గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు



దుబ్బాకలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తదితరులు



బెజ్జంకిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గజ్వేల్‌లో ఫాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

మిరుదొడ్డి/బెజ్జంకి/గజ్వేల్/సిద్దిపేట అర్బన్/సిద్ది పేట రూరల్/కొండపాక/మర్కుక్/ నంగునూరు/కుకునూరుపల్లి/చిన్నకోడూరు/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైతుల సౌకర్యం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని తెలిపారు. అదేవిధంగా రైతులకు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. బుధవారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు దుబ్బాక మండలంలోని హబ్షీపూర్, దుబ్బాక మున్సిపాలిటీలోని చేర్వాపూర్, దుబ్బాక పీఏసీఎస్, చెల్లాపూర్‌లోని మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ పొలాలకు మల్లన్నసాగర్ కాల్వల ద్వారా నీరును అందించాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఈ మేరకు త్వరలోనే పొలాలకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట దుబ్బాక, మిరుదొడ్డి మండలాల తహసీల్దార్లు సంజయ్‌కుమార్, ఉదయశ్రీ, ఎంపీడీవోలు గణేష్‌రెడ్డి, భాస్కర్‌శర్మ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని గుండారం, పెరకబండ, చీలాపూర్, రేగులపల్లి, బెజ్జంకి, తిమ్మాయిపల్లి, ముత్తన్నపేట, గాగిల్లాపూర్, వీరాపూర్, తోటపల్లి, దేవక్కపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం పాక్స్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పాక్స్ చైర్మన్ జేజాల వెంకటేష్‌గౌడ్‌తో కలసి ప్రారంభించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. సిద్దిపేట రూరల్ మండలంతో పాటు నారాయణరావుపేట మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్ రెడ్డి ప్రారంభించారు. కొండపాక మండలం దమ్మక్కపల్లి, రవీంద్రనగర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ దిలీప్ నాయక్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన మర్కుక్‌తో పాటు పాములపర్తి, చేబర్తి, అంగడి కిష్టాపూర్, ఎర్రవల్లి, వరదరాజపూర్, దామరకుంట, శివార్‌వెంకటాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. నంగునూరు మండలంలోని సిద్దన్నపేట వ్యవసాయ మార్కెట్, బద్దిపడగ, జేపీ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్లు కోళ్ల రమేష్ గౌడ్ ఎల్లంకి మైపాల్‌రెడ్డి ప్రారంభించారు. కుకునూరుపల్లి మండలం మెదినీపూర్ రైతు వేదిక వద్ద బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ దేవేందర్‌రెడ్డి కొండపాక ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో సుజాత, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, అల్లీపూర్, గంగాపూర్ పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం కరుణాకర్, తహసీల్దార్ హరికిరణ్ కుమార్, ఏపీఎం అంజనేయులు ఇతర అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్‌గుప్తా ప్రారంభించారు.

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని పీఆర్టీయూ తెలంగాణ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా టీపీఆర్టీయూ జిల్లా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత గాలి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఒకానొక సమయంలో ప్రభుత్వాన్నే ఎదిరించి తన ఉద్యోగానికి రాజీనామా చేశారని చెప్పారు.

కొమురవెల్లి గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక

చేర్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి గ్రామ గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక బుధవారం గ్రామంలో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా బత్తిని యాదగిరి, దొడ్ల విష్ణుమూర్తి, అధ్యక్షుడుగా తాళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా ముత్యం పరశురాములు, ప్రధాన కార్యదర్శిగా శివలింగ రమేశ్, కోశాధికారిగా బత్తిని నర్సింహులు, శివయ్య, కార్యదర్శులుగా కొయ్యడ నరేశ్, ముత్యం కరుణాకర్, దొమ్మాట రమేశ్, సలహాదారులుగా బండకింది బాలకనకయ్య, దొడ్లవెంకటస్వామి ఎన్నికయ్యారు.

సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో కాంగ్రెస్ నాయకుల భోజనం

చేర్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం నాగపురి శివారు దూదేకులపల్లి కాలనీకి చెందిన లబ్ధిదారురాలు మంజ నర్సవ్వ ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యాన్ని అందిస్తున్నారన్నారు.

జీపీ రికార్డుల తనిఖీ

మద్దూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం, రేబర్తి, వల్లంపట్ల గ్రామపంచాయతీల రికార్డులను బుధవారం డీఎల్పీవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారం గ్రామంలోని జీపీ రికార్డులతో పాటు డంపింగ్, నర్సరీ, రేబర్తి, వల్లంపట్లలో గ్రామ సభ రికార్డులతో పాటు ఇంటి పన్నుల వసూళ్ల, క్యాష్‌బుక్, జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ, 15వ ఫైనాన్స్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో దూల్మిట్ట ఇన్‌చార్జి ఎంపీడీవో వీరరాజ్, ఎంపీవో వెంకటేశ్వర్లు, సెక్రటరీలు మాధవ్ జాదవ్, అశోక్, కిరణ్ ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

● పలు మండలాల్లో సీపీఎం నిరసనలు

మిరుదొడ్డి/చేర్యాల/గజ్వేల్/మద్దూరు/కొండపాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ ధర పెంపుపై కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలోని పలు మండలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరనుపెంచి పేద ప్రజల నడ్డివిరుస్తున్నదని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం తక్షణమే ధరను తగ్గించకుంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. దుబ్బాక బస్టాండ్ వద్ద కేంద్రప్రభుత్వం గ్యాస్‌పై రూ. 50రూపాయలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొమురవెల్లి మండలకేంద్రంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు గ్రామప్రధాన చౌరస్తా వద్ద కట్టెలతో వంట చేసి నిరసన తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. మద్దూరు మండలకేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండీ షఫీ మాట్లాడుతూ.. పెంచిన ధరల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొండపాక మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య,మండల కమిటీ సభ్యులు ముడోజు కనకచారి మాట్లాడుతూ.. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.





దుబ్బాకలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మతో, కొమురవెల్లిలో కట్టెలపొయ్యి వెలిగిస్తూ సీపీఎం నాయకుల నిరసన

జానపద సాహిత్యంపై జాతీయ సదస్సు



ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జానపదసాహిత్య ఆద్య పరిశోధకులు ఆచార్య బిరుదురాజు రామరాజు శత జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో అంతర్జాల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో జానపదసాహిత్య పునర్మూల్యాంకనం అనే అంశంపై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. జి. సునీత, సదస్సు కన్వీనర్, తెలుగుశాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ఉన్నంత జానపదసాహిత్య సంపద దేశంలో మరోప్రాంతానికి లేదన్నారు. ఈ సదస్సుకు రెండు తెలుగురాష్టాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, తదితర ఇతర ప్రాంతాల నుంచి పరిశోధకులు పత్రసమర్పణలు చేస్తారని, ఈ రంగంలో విశేషపరిశోధనలు చేసిన ఆచార్యులు, పరిశోధకులు వక్తలుగా హాజరవుతారని సంపత్కుమార్ రెడ్డి వివరించారు. కరపత్ర ఆవిష్కరణలో సదస్సు సమన్వయకర్త పిట్ల దాసు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పి.అయోధ్యారెడ్డి,వివిధ విభాగాల బాధ్యులు, తెలుగుశాఖ అధ్యాపకులు సంపత్ కుమార్, నరేశ్, రామస్వామి, శైలజ, సాయిసురేశ్, నర్సింహులు, రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ర్యాలీలు బూటకం : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

చేర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ విషయంలో బీజేపీపై అసత్య ప్రచారం చేస్తూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న సంవిధాన్ ర్యాలీ అంతా బూటకమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్ మండిపడ్డారు. చేర్యాలలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను రకరకాలుగా అవమానపరిచింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. కేంద్రప్రభుత్వం నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమపథకాల అమలు, మౌలిక వసతులు నోచుకుంటున్నాయన్నారు. సమావేశంలో మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు, నాయకులు తౌట బాలరాజు, కర్క తిరుపతిరెడ్డి, మడికొండ శ్రీనివాస్, కురార్రం బాలనర్సయ్య, అప్పాల బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



ఉపాధ్యాయురాలు అరుంధతి దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో

మర్కుక్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని మర్కుక్ మండల విద్యాధికారి వెంకట్‌రాములు, పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, కుమార్ అన్నారు. మండలంలోని కాశిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న తోట అరుంధతి ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో వెంకట్ రాములు హాజరై అరుంధతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లతీసైదా, శంకర్‌రెడ్డి, పీఆర్టీయూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సనత్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బెజ్జంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన కోడెల ఐలవ్వకు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ బుధవారం రూ.81,500 విలువైన చెక్కును ఐలవ్వ కుటుంబానికి అందజేశారు.

● **చేర్యాల:** చేర్యాల పట్టణానికి చెందిన గుడాల లింగయ్యకు రూ.29 వేలు, గౌరాయపల్లి గ్రామానికి చెందిన ఇంద్ర చంద్రశేఖర్‌కు రూ.34వేలు, ఎల్లదాస్‌నగర్‌కు చెందిన నూనె బుచ్చమ్మకు రూ.30వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు బుధవారం మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను అందజేయాలి

మద్దూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌యువవికాస్‌కు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగ యువత దరఖాస్తు ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. యువ వికాసానికి ఇంతవరకు మండల వ్యాప్తంగా 625 మంది దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయాలన్నారు. ఇప్పటి వరకు 320 మంది మాత్రమే కార్యాలయంలో సమర్పించారన్నారు. మిగతా వారు త్వరగా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురు పట్టుబడ్డారు. నిందితులను బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా వారికి రూ.12,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హుస్నాబాద్ మున్సిపల్‌లో ఇక బయోమెట్రిక్



బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసుకుంటున్న కమిషనర్

హుస్నాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమయపాలన పాటించేందుకు హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నుంచి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కూడా బయోమెట్రిక్ హాజరును ప్రవేశపెట్టారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో 39 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 113 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు మున్సిపల్ పారిశుధ్య కార్మికులున్నారు. ఈ బయోమెట్రిక్ విధానంతో సిబ్బంది సమయపాలనలో పారదర్శకత ఉంటుందని చెబుతున్నారు.

పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి కృషి



ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి పేర్కొన్నారు. 'ఆరోగ్య కేంద్రానికి సుస్తీ' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏయే సమస్యలు ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన సదుపాయాలు సమకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో పీహెచ్‌సీకి మంజూరైన నిధులు ఎంతవరకు వినియోగించారు. చేయాల్సిన పనులపై ఆరా తీశారు. సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్ సునీత, ఫార్మాసిస్టు మల్లికార్జున్, యూడీసీ భార్గవి, స్టాఫ్ నర్సు కవిత తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్

గజ్వేల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, క్యాండీ స్టిక్స్, ఐస్‌క్రీమ్ స్టిక్స్ డెకరేషన్ కోసం వాడే పాలిస్టైరీన్ థర్మకోల్, సంబంధిత ఇతర వస్తువులు అమ్మినా, కొనుగోలు చేసినా, నిలువ చేసినా చట్టరీత్యా నేరమని వివరించారు. ఫంక్షన్‌హాళ్ల యజమానులు, బంకెట్‌హాళ్ల యజమానులు నిబంధనలు ఉల్లంఘించవద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు అంకిత భావంతో పని చేయాలి



మాచాపూర్‌లో జీవాలకు టీకాలు వేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పశువైద్య శిబిరాల్లో అంకిత భావంతో పని చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాములు సూచించారు. మండలంలోని చంద్లాపూర్ శివారులోని పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో, పశు సంవర్ధకశాఖ సహకారంతో జాతీయసేవా పథకంలో (ఎన్ఎస్ఎస్) భాగంగా బుధవారం మాచాపూర్ గ్రామంలో ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 2 వేల జీవాలకు (గొర్రెలు, మేకలకు) ఉచితంగా టీకాలు వేసి, 20 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాములు పశువులకు, జీవాలకు వచ్చే పలు వ్యాధులు వాటి నివారణ చర్యల గూర్చి విద్యార్థులకు వివరించి శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు జాతీయసేవా పథకం, సమాజసేవ గూర్చి వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి రథోత్సవం బుధవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన దేవతామూర్తులను గరుడ వాహనంపై గ్రామవీధుల గుండా ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. కోలాటాలతో యువతీ యువకులు రథోత్సవాన్ని మరింత శోభ తెచ్చారు. రామాలయం వద్ద కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ ఐలం యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

అశ్వ వాహనంపై ఊరేగిన నృసింహుడు



బెజ్జంకిలో అశ్వవాహనంపై ఊరేగుతున్న నృసింహస్వామి

బెజ్జంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ లక్ష్మీసమేత నృసింహ స్వామిని అశ్వ వాహనంపై ఆలయ అర్చకులు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళ హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం



నారాయణరావుపేటలో నిర్వహించిన సంవిధాన్ పాదయాత్రలో పూజల హరికృష్ణ తదితరులు



గజ్వేల్‌లోని 13వ వార్డులో పాదయాత్ర అనంతరం మాట్లాడుతున్న నర్సారెడ్డి



దౌల్తాబాద్: సూరంపల్లిలో రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు

సిద్దిపేట రూరల్/దౌల్తాబాద్/మిరుదొడ్డి/గజ్వేల్/జగదేవ్‌పూర్/చేర్యాల,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరిట నిర్వహిస్తున్న పాదయాత్ర బుధవారం కొనసాగింది. నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన సంవిధాన్ పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పునరుద్ఘాటించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేసే కుట్రలు చేస్తుందని, దీన్ని ఎంతమాత్రం సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాగన్న కరుణాకర్, మండల పార్టీ అధ్యక్షుడు బర్మ రామచంద్రం, నాయకులు తదితరులు పాల్గొన్నారు. దౌల్తాబాద్, మిరుదొడ్డి మండలాల్లో నిర్వహించిన కాంగ్రెస్ సంవిధాన్ పాదయాత్రలో గాంధీ, అంబేడ్కర్ ఫొటోలను చేత పట్టుకొని రాజాంగాన్ని రక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ దుబ్బాక నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమర యోధులను, రాజ్యాంగాన్ని అవమానపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని 13వ వార్డులో మాజీ కౌన్సిలర్ షెహనాజ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు సమీర్ ఆధ్వర్యంలో సంవిధాన్ పాదయాత్ర చేపట్టారు. ర్యాలీలో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న దాడి సరికాదన్నారు. పాదయాత్రలో ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్ర నిర్వహించారు. కొమురవెల్లి మండలంలోని రాంసాగర్, కిష్టంపేట గ్రామాల్లో, చేర్యాల మండలం చుంచనకోట, శబాషీ గూడెం, నాగపురి, గండికుంట, దూదేకులపల్లి కాలనీలో కాంగ్రెస్ నాయకులు సంవిధాన్ పాదయాత్ర నిర్వహించి మహనీయుల చరిత్రపై అవగాహన కల్పించారు. అదే విధంగా మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామంలో, చిన్నకోడూరు మండలంలోని విఠలాపూర్, గంగాపూర్ గ్రామాల్లో ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు.